# మానవత్వాన్ని అభివృద్ధి గావించుకొనండి

**ప్రేమాత్మ స్వరూపులారా!**

ఈనాడు ప్రపంచము గొప్ప మేధావులచే, వితండ వాదములు చేసే పండితులచే అనుభవజ్ఞులైన రాజకీయ వాదులచే, కాషాయ వస్త్ర ధారులైన సన్యాసులచే నిండియున్నది. ఈనాడు మానవత్వము లోపల దివ్యత్వము శూన్యమైంది. కేవలము వితండ వాదములేగాని, శీల, సానుభూతులు ఎక్కడా కనిపించటం లేదు మానవత్వములోని దివ్యత్వాన్ని ఈనాడు మరచిపోయినారు. ఈనాడు ప్రపంచములోని మానవులలో ప్రధానముగా ఉండవలసినది మానవత్వమే.

ఎన్ని విద్యలను అభ్యసించినప్పటికిని, ఎన్ని పదవులను ఏలినప్పటికిని, ఎంతటి వైజ్ఞానికుడైనప్పటికి మానవతా విలువలే లేకుండిన అతడు మానవుడనిపించుకోడు. మానవత్వాన్ని ఈనాడు అభివృద్ధి చేసుకోవటానికి ప్రయత్నించాలి. మానవత్వమనగా ఏమిటి? మనసు, మాట, క్రియ ఒక్కటైన అదియే మానవత్వము. మనసు వేరు, క్రియ వేరు, మాట వేరు అయినప్పుడు అది మానవత్వానికి విరుద్ధమైన దానవత్వముగా మారుతుంది. త్రికరణశుద్ధితో కూడిన తత్త్వాన్ని మనము అనుభవించాలి. మానవుడి పేరు పెట్టుకొని మానవత్వానికే వ్యతిరేకముగా ప్రవర్తించటము మానవత్వమునకే అపకీర్తి. విత్తనము భూమిలో పెట్టినప్పుడే వృక్షమై ఫలపుష్పాలను అందిస్తుంది. దానినే బండలో పెట్టినప్పుడు అది అభివృద్ధి కాదు. మానవత్వమన్నది కేవలము ఆధ్యాత్మిక హృదయమునందు మాత్రమే అభివృద్ధి కాగలదుగాని అందరి హృదయములందు అభివృద్ధి కానేరదు. కనుకనే ఈనాడు మానవత్వమన్నది అభివృద్ధి కావాలంటే జీవితములో వివిధ పరిధుల మధ్య సానుభూతి సమన్వయములు అభివృద్ధి చేసుకోవాలి.

sri sathyasai vachanamrutam

## మానవత్వముతోనే దివ్యత్వము ఉన్నది

ప్రేమస్వరూపులారా! మనము మానవులము. ఈ మానవత్వములోని దివ్యత్వము ఏమిటని మనము విచారించుకున్నప్పుడు మానవత్వము కేవలము నాటకము బూటకములతో కూడినది కాదని తెలుసుకోవాలి. మానవత్వము ప్రజ్ఞాన, విజ్ఞాన, సుజ్ఞానములతో కూడుకొన్నటు వంటిది. ఈనాడు అర్థములేని ఆవేదనలచే, అంతులేని ఆశలచే, అప్రాప్య ప్రాప్తికై ప్రాకులాడుతూ అశాంతికి గురైపోతున్నాము. ఇట్టి అజ్ఞాన అశాంతులతో ఉన్న మానవునకు చక్కని దిక్కును చూపే జ్యోతే ఆధ్యాత్మిక జ్యోతి. ఈనాడు విసుగు ఎక్కువ. చిరాకు ఎక్కువ. ఉపన్యాసమును వినే శ్రద్ధాభక్తులు కూడా ప్రజలలో లేకున్నవి. కారణము ఏమిటి? ఆకార మానవత్వము చేత లోకానికి ఏమాత్రము ఉపయోగములేదు. ఈనాడు ప్రచారప్రబోధలు మాత్రము చేస్తున్నారు. గాని ఆచార విచారములు శూన్యమైపోయాయి. ఈనాడు ఎవరికైనా ఆచారము అత్యవసరము.

ప్రపంచ అభివృద్ధికి కావలసినది ఫ్యాక్టరీలో ఇండ్రస్టీలో కాదు. సద్గుణవంతులైన విద్యార్థులు, విద్యార్థినులు. స్త్రీ పురుషులు అత్యవసరము. అప్పుడే దేశము అభివృద్ధి కాగలుగుతుంది. మనము మానవత్వము యొక్క అంతర్‌దృష్టిని కోల్పోయినాము. మానవత్వములో దివ్యత్వము ఎంతో విశాలముగా ఉంటుంది. అనంతములో అనంతముగను, సూక్ష్మములో సూక్ష్మముగాను ఉన్నవాడే భగవంతుడు. కనుకనే అణోరణీయాన్ మహతోమహీయాన్ అనుభజ్ఞుడు అనే పదమును మనము ప్రయోగపెడుతున్నాము. వ్యాపారములో ఇతడు అనుభవజ్ఞుడని అంటుంటాము. వైద్యములో అనుభవజ్ఞుడు అంటుంటాము. కానీ అనుభవజ్ఞుడనగా భగవంతుడే అని అర్థము. అను అనగా చాలా చిన్నది. మన హృదయములో చాలా చిన్నదిగా కనిపించకుండా ఉన్న భగవంతుడే అనుభవజ్ఞుడు. ఇలాంటి పవిత్రమైన అర్థాన్ని మనము ఈనాడు విస్మరించినాము. బాహ్యమైన అర్థములతో మనము భ్రాంతి పొందుతున్నాము. తన తత్వాన్ని తాను మరచిపోయి, తన శక్తిసామర్థ్యములు తాను మరచిపోయి తిండి తీర్థాదుల కోసమై పాటుపడుతున్నాడు.

ఈనాటి మానవుడు తన కోర్కెలు పెరిగేకొలది ఆనందము తగ్గునన్న విషయము తాను గుర్తించుకోటం లేదు. చీమల పుట్టవలె కోరికలు పుడుతూ పుడుతూ వస్తున్నాయి. ఎంత

srisathyasaivachanamrutam

తినినప్పటికిని తృప్తి లేదు. ఎంత అనుభవించినప్పటికి తృప్తి లేదు. పశు పక్ష్యాదులు తిని తృప్తి పడుతున్నాయి. వాటికి దాచుకునే స్వార్థముగాని, దోచుకునే పాపముగాని లేవు. కాని మానవుడే దాచుకొనే స్వార్థమునకు దాచుకొనే పాపమునకు గురి అయిపోతున్నాడు.

దివ్యమైన మానవత్వాన్ని ఈనాడు మనము అభివృద్ధి గావించుకోవాలి. ఈ దివ్యత్వాన్ని మనము ఎక్కడనుండో కొని తీసుకు రానక్కరలేదు. అంతర్బహిశ్చ తత్సర్వమ్ వ్యాప్యనారాయణః . ఆ దివ్యత్వము మనలోనే ఉంటున్నది. మనకంటె మించినది లోకములో మరొక్కటి లేదు. ప్రతి మానవుడు కూడ భగవత్స్వరూపమే. ఇన్ని తలలతో ఇన్ని చేతులతో ఉన్న భగవంతుడే విరాట స్వరూపము. అందరు భగవత్స్వరూపులే.

**మీరు ప్రేమ స్వరూపులని మరువకండి**

భగవంతుడు ప్రేమమయుడు. ఆ ప్రేమనుండి ఆవిర్భవించిన చిదానంద స్వరూపుడే మానవుడు. ప్రతి మానవునియందు ప్రేమ లేకపోలేదు. ఆ ప్రేమను మానవుడు ఈనాడు బాహ్య ప్రపంచమునందు ప్రసరింప చేయటము చేతనే తన నిజ స్వరూపాన్ని తాను మరచిపోతున్నాడు. కనుక భగవత్ప్రేమను సంకుచితమైన రీతిగా ఉపయోగపెట్టకుండా సమత్వమైన ఆత్మతత్త్వముతో అందరికీ అందించటానికి మనము ప్రయత్నించాలి. ఆ ప్రేమలోనే మన జీవితమంతా సార్థకము గావించుకోవాలి. ప్రేమకంటె మించినది మరొకటి లేదు. ఈ ప్రేమను ఈనాడు మనము కోల్పోయినాము. తల్లి బిడ్డలకు ప్రేమ లేదు. భార్యభర్తలకు ప్రేమ లేదు. స్నేహితుల మధ్య ప్రేమ లేదు. హల్లో! గుడ్ బై అని చెప్పటము మాత్రమేనా ప్రేమ. భావానికి భావము హృదయానికి హృదయము ఏకము కావాలి. సమత్వముతో కూడిన మమత్వము పెంచుకోవాలి. భిన్నత్వముతో కూడిన మమత్వము సంకుచిత మార్గములో ప్రయాణము చేస్తుంది. కనుక మనము సంకుచితమైన భావాలను తృంచివేసి విశాలమైన భావములను పెంచుకొని అందరియందు ఉన్న భగవంతుడు ఒక్కడే అని తెలుసుకోవాలి. ఏకోవసి సర్వభూతాంతరాత్మ. నీయందు నాయందు ఉన్నది ఒక్కడే అదే దైవత్వము.

భూమి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము ఎక్కడ ఉంటున్నాయి. ఇవి ప్రపంచములో ఉంటున్నాయి. ఈ పంచభూతముల స్వరూపమే ప్రపంచము. ఈ పంచభూతములతో



sri sathyasai vahanamrutam

కూడినటువంటిదే ప్రపంచము. మనమే ప్రపంచము. పంచభూతములు ఒకదానికంటె మరొకటి తేలికగా ఉంటుంది. వీటికన్నిటికి ఆధిపత్యము వహించిన తత్త్వమే ఆత్మతత్త్వము. భూమికంటె అతిసూక్ష్మమైనది జలము ఇది సూక్ష్మమే కాకుండా అతి విశాలమైనది. ఈ జలముకంటె వాయువు మరింత విశాలమైనది; సూక్ష్మమైనది. మరి వాయువు కంటె విశాలమైనది సూక్ష్మమైనది ఆకాశము. కానీ ఆత్మ ఆకాశముకంటె మరింత సూక్ష్మమైనది విశాలమైనది.

## కృతజ్ఞత కలిగి ఉండండి

ఈనాడు మానవులకు కావలసినది కృతజ్ఞత. ఈ కృతజ్ఞత లేకపోతే మానవుడు జీవించలేడు. సుఖమును ఆనందమును అనుభవించలేడు. తల్లి, తండ్రి, గురువు, దైవము వీరికి కృతజ్ఞత తెలియజేయమంటారు. ఎందుకు ఈ పదములను యీ వరసలో ఉపయోగపెడుతుంటారు. తల్లి, గురువు దైవము. తండ్రి అని ఎందుకు చెప్పకూడదు? ఈ వరుసగా వున్న పదముల అర్థమేమి? మనలను చిన్నప్పటినుండి రక్షించి, పోషించి, సంరక్షించి మలమూత్రాదులను శుభ్రపరచి, మనలు పెంచి పెద్దచేయునది తల్లి. ఆ తల్లిని మొట్టమొదట మనము గౌరవించాలి. ఆ తల్లి తండ్రిని చూపించాలి. బిడ్డను ఆదర్శవంతునిగా తీర్చిదిద్దాలన్న అభిలాషతో తండ్రి బిడ్డను సద్గురువు వద్దకు చేర్చుతాడు. ఈ సద్గురువు ఏమి చెయ్యాలి. ఇతను దైవాన్ని చూపించాలి. దైవాన్ని నిరూపించాలి. దైవత్వాన్ని బోధించాలి. ఇదే నిజమైనది. కనుక తల్లి తండ్రిని చూపించాలి. తండ్రి గురువును చూపించాలి. గురువు దైవాన్ని చూపించాలి. అందువలన వీరికి మనము కృతజ్ఞత తెలియచెయ్యాలి. కాని ఈనాడు మనము ఆవిధముగా చేయుటము లేదు. మనము కన్న తల్లి తండ్రులనే గౌరవించటం లేదు. తల్లితండ్రులనే ప్రేమించటం లేదు. ఏదో మధ్యలో వచ్చిన దానిని మనము ప్రేమిస్తున్నామంటే ఇది artificial love. ఇది కృత్రిమమైన ప్రేమ.

దీనికి మంచి ఉదాహరణ మహాభారతములో ఉన్నది. కృష్ణుని సంరక్షణ వలన పాండవులంతా జీవించారు. గాంధారి నూరుగురు పుత్రులలో ఒక్క పుత్రుడైనా బ్రతుక లేదు. గాంధారి శోకముతో కృశించింది. గాంధారి శోకమును చూడలేక అనేకమంది కృష్ణుని నిందించారు. ఆమెకు శాంతి ప్రసాదించాలని కృష్ణుడు గాంధారి వద్దకు వచ్చాడు. కృష్ణుని

sri sathyasaivachanamrutam

చూచినవెంటనే గాంధారి కోపముతో ఉట్టిపడింది. కృష్ణా! దైవమైన నీకింత భేదభావమా. నా కుమారులలో ఒక్కరినైనా బ్రతికించ లేకపోతివా. అని కృష్ణుని దూషించింది. అప్పుడు కృష్ణుడు చిరునవ్వుతో చెబుతాడు నీదృష్టి ఒక్క కుమారుని పైననైనా ప్రసరించిందా? అని అడిగాడు. నీవే నీ కుమారులను చూడ లేదు. నీ దృష్టికే నోచుకోని నీ కుమారులు దైవదృష్టికి ఏవిధముగా నోచుకోగలరు? కనుక మొట్టమొదట మనము తల్లిని ప్రేమించాలి. తల్లి ప్రేమకు గురికావాలి. అప్పుడే నిజమైన దైవప్రేమకు గురికాగలరు. మాతృదేవోభవ అని తల్లిని గౌరవించాలి. రామచంద్రుడు అదే చెప్పాడు. జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి. నా తల్లియే నాకు స్వర్గము. తల్లికంటె మించిన స్వర్గము లేదని చెప్పాడు. అలాంటప్పుడు మనము దేనిని పాటిస్తున్నాము. మన భారతీయ సంస్కృతిని మనము ఏమి గుర్తిస్తున్నాము. మనము ఏమాత్రము గుర్తించటంలేదు ఎన్ని సిద్ధాంతములు తెలుసుకున్నప్పటికిని, ఎన్ని వైజ్ఞానిక పరిశోధనలు సలిపినప్పటికిని, నీవు భౌతికముగా ఎన్ని సుఖములను అనుభవించినప్పటికిని నీవు మానవునిగా ఎన్ని అర్హతలు సంపాదించుకున్నావనేది ముఖ్యము. ఏమి లేదు. మాటలలో హీరో కాని చేతలలో జీరో అయిపోయినావు. ఇది కాదు మానవత్వము. నిజముగా మానవుడు మానవుడుగా జీవించాలి. మానవ జీవి పరమార్థము 'మానవ' అన్న పదములోనే వున్నది. మా-న-వ. మా అనగా అజ్ఞానము. న అనగా లేకుండా వ అనగా వర్తించటము. అనగా అజ్ఞానము లేకుండా వర్తించటము. వాడే మానవుడు. కానీ ఈనాడు మన జీవితమంతా అజ్ఞానములోనే కృంగిపోతున్నది.

**చిత్తశుద్ధి ముఖ్యము**

ఈనాడు మన జీవితము కుళ్లి, కృశించి కంపుకొడుతున్నది. ఇది కాదు మానవత్వము. మనము బాహ్యరీతిలో పరిశుద్ధముగా ఉన్నంత మాత్రమున చాలదు. హృదయ పరిశుద్ధి కావాలి. చిత్తశుద్ధి కావాలి. మనము చేసే సర్వకర్మలు చిత్తశుద్ధికి ఆధారమైనవి. చిత్తస్య శుద్ధయే కర్మః. మనము ఎన్ని కర్మలు చేసి ఏమి ప్రయోజనము? మనమంతా బండలుగానే ఉంటున్నాము. జీవితములో ఎన్నో కష్టములు, నష్టములు ఎదురవుతుంటాయి. వీటికన్నింటికిని తట్టుకొని నెట్టుకొని ముందుకు సాగినవాడే నిజమైన మానవుడు. మనకు ఎదురుదెబ్బలు అదురుదెబ్బలు

sri sathyasai vahanamrutam

తగులుతుంటాయి కాని మనము బెదరకూడదు. సాధించటానికి తగిన కృషి చెయ్యాలి. ఈ సాధించటానికి తగిన బలము ఆత్మబలము వల్లనే వస్తుంది. ఏ బలము ఉన్నప్పటికి ఆత్మబలము లేకపోతే ప్రయోజనము లేదు. కర్ణునకు భుజబలము, అర్థబలము ఉన్నాయి. కానీ దైవబలము లేకపోవటం వలన యుద్ధములో చిక్కుకొని పోయాడు. దైవబలము అత్యవసరము.

ప్రేమస్వరూపులారా! దైవము కానిది మరొకటి ఈ జగత్తునందు లేదు. మీరు చూచేది సర్వము దైవమే. అనుభవించేది దైవము. ఆలకించేది దైవమే. ఆహారము అతనే. పానీయము అతనే. మన చుట్టూ ఉన్నగాలినే మనము చూడలేము. గాలిని పీల్చుకుంటున్నామేగాని చూడటం లేదు. గాలిని అనుభవిస్తున్నామేగాని పట్టుకొనటం లేదు. దైవము పట్టుకుంటే చిక్కేవాడు కాదు. కన్నులకు కనిపించేవాడు కాదు. హృదయానికి అనిపించే వాడు. మనసుకు తెలిసేటువంటివాడు. మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః. ఈ మనస్సే జగత్స్వరూపాన్ని ధరించింది. మనో మూల మిదం జగత్ మనస్సును మనము గుర్తించటానికి ప్రయత్నించాలి. ఏమిటి ఈ మనస్సు. మనస్సే మాధవత్వము.

ఈ మనస్సును మనము సరియైన మార్గములో ప్రవేశపెట్టటానికి ప్రయత్నించాలి. అప్పుడే మనము సరియైన ఆనందాన్ని అందుకోగలము. మనస్సు పిచ్చికోతివలె సంచరిస్తుంది. అది సరియైన మానవత్వానికి గుర్తుకాదు. పశుపక్షి మృగాదులు కూడా ఆహార నిద్రా భయమైథునాదులను అనుభవిస్తున్నాయి. మానవుడు కూడా వాటినే అనుభవిస్తుంటే జంతూనాం నరజన్మ దుర్లభం అనటంలోని అర్థమేమిటి? మానవుడు మానవుడుగా ఉండి ఇతరులకు ఆదర్శమైన మానవుడిగా నిరూపించాలి. మనము అల్లర చిల్లరిగా ప్రవర్తించకుండా పవిత్రమైన మార్గములో ప్రవేశించాలి. మన జీవితము చాలా ఉత్తమమైనది. పవిత్రమైనది. ఇలాంటి మానవ జీవితాన్ని పవిత్రము గావించుకోవాలిగాని వ్యర్థము గావించుకోకూడదని తెలుసుకోవాలి.

## ప్రేమ తత్త్వాన్ని పెంచుకొండి

ప్రేమస్వరూపులారా! ఏ సాధన చేయకపోయినప్పటికిని ఏ జపధ్యానములు చేయకపోయినప్పటికిని ప్రేమతత్త్వాన్ని పెంచుకోండి. ఆ ప్రేమ అనే భగవత్ప్రసాదాన్ని సర్వులకు పంచిపెట్టండి. ఆ ప్రేమకంటె మించినది మరొక్కటి లేదు. ఈ ప్రేమద్వారానే ప్రపంచమంతా

srisathyasaivachanamrutam

ఒక్కటైపోతుంది. ప్రేమలేకపోవటం వలనే ఇంటిలో గొడవలు బయలుదేరుతున్నాయి. ప్రేమయే దైవము. దైవమే ప్రేమ. Love is God. Live in Love. ఇదే ప్రధానమైన లక్ష్యముగా తీసుకోవాలి. ఎవరి దగ్గరకు పోయినప్పటికి వినయ విధేయతలను ప్రకటించాలి. ఈనాడు సత్య ధర్మ శాంతి ప్రేమలు గురించి ప్రచారము ప్రబోధలు జరుగుతున్నాయి. ప్రదర్శనలు జరుగుతున్నాయి. కానీ ఆదర్శముగా నిరూపించటం లేదు. దానిని ఆచరించి అనుభవించాలి. మనము ప్రకటించటం వలనగాని ప్రదర్శించటం వలనగాని ప్రయోజనం లేదు. దానివలన లోకము ఏనాడు మారదు. ఏనాడు మనము ఆచరణలో ప్రదర్శిస్తామో అప్పుడే నిజమైన ఆదర్శవంతవుతుంది.

నిజముగా మానవుడు ఆదర్శనీయుడు. ఆదర్శాన్ని నిరూపించటానికి ఒక్క మానవత్వమే సరియైన ఆదర్శము. ఈ జగత్తులో మానవత్వాన్ని మించినది మరొక్కటి లేదు. ఈనాటి అశాంతి అల్లకల్లోలములకు కారణము ఏమిటి? చెప్పటం ఒకటి చేయటం మరొకటి. ఇదే కారణం. అందువలనే మానవత్వాన్ని కోల్పోతున్నాము. తలచినదే చెప్పు. చెప్పినదే చేయి. ఈ మూడింటి యొక్క ఏకత్వము వలననే మానవత్వము అభివృద్ధి అవుతుంది. ఇదే మీరు గుర్తించవలసినది. ఆధ్యాత్మికమనగా ఏకాకి జీవితముగాని, ఒంటరితనమనిగాని భావించకూడదు. మానవత్వాన్నంతా ఒక్కటిగా చేసి దానిని ఆచరించి అనుభవించి ఆనందించి పరులకు అందింప చేయటమే ఆధ్యాత్మికము. అంతేగాని భజనలు చేయటం కాదు. పూజలు చేయటం కాదు. ఇవి సత్కర్మలే. అందరిని ప్రేమించటమే భక్తి. అందరియందు దైవమున్నదన్న విశ్వాసాన్ని పెంచుకోవాలి. సర్వజీవ నమస్కారం కేశవం ప్రతిగచ్ఛతి. ఎవరికి నమస్కారము చేసినా కేశవునకు నమస్కారము చేసినట్లుగా భావించాలి. సర్వజీవ తిరస్కారం కేశవం ప్రతిగచ్ఛతి. ఎవరినీ తిరస్కరించినా కేశవుని తిరస్కరించినట్లుగా భావించాలి. ఇటువంటి భావము వచ్చినప్పుడే మానవత్వము దివ్యత్వముగా రూపొందుతుంది.

ప్రేమస్వరూపులారా! కేవలము ఉపన్యాసములచే హృదయములను కదిలించలేరు, కరిగించలేరు. ఉపన్యాసములతో అశాంతి కలుగుతుంది. మనసు వేడెక్కుతుంది. హృదయం కలత చెందుతుంది. సందేహములతో కూడి ఉంటుంది. ఈ ఉపన్యాసములకంటే ఆచరణయందు

srisathyasaivachanamrutam

అందరియందున్న ప్రేమతత్త్వము దైవత్వము ఒక్కటేయని గుర్తించుకొని ఆ మార్గాన్ని అనుసరించటమే చాలా ఉత్తమమైన మార్గమని నేను ఆశిస్తూ ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

**(తేది. 24-03-1989న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam